# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

గురువారం 27-7-2023






## ఖతార్ విమానం అత్యవసర ల్యాండింగ్

హైదరాబాద్, జూలై27 (తెలుగుప్రభ):

దుబాయ్ నుంచి నాగ్‌పూర్ వెళ్లాల్సిన ఖతార్ ఎయిర్‌లైన్స్ విమానం అత్యవసరంగా ల్యాండ్ అయింది. భారీ వర్షాలు,వాతావరణం అనుకూలించకపోవడంతో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ల్యాండింగ్ చేసినట్లు తెలుస్తోంది. విమానంలో 160 మంది ప్రయాణికులున్నారు. సంబంధిత అధికారులు వారిని నోవాటెల్‌కు తరలించారు.



## హెలికాప్టర్లను పంపండి..

### మిలటరీ అధికారులతో మాట్లాడండి..

### ప్రగతి భవన్ నుంచి సీఎం సమీక్ష



హైదరాబాద్, జూలై27(తెలుగుప్రభ):

రాష్ట్రవ్యాప్తంగా నిన్నటినుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావు ప్రగతిభవన్ నుంచి అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లోనూ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలకు అవసరమైన సహాయచర్యలు చేపట్టాలని ఆదేశించారు. గోదావరి పరీవాహక ప్రాంతాల్లో ప్రజలలను అప్రమత్తంగా ఉంచాలని ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి గ్రామం పూర్తిగా నీట మునగడంతో మంత్రి ఎర్రబెల్లి దయాకరరావుతో మాట్లాడారు. సహాయక చర్యల కోసం హెలికాప్టర్లను పంపించేందుకు మిలటరీ అధికారులతో మాట్లాడాలని సీఎస్ శాంతికుమారిని ఆదేశించారు. దాంతోఆమె సైన్యంతో సంప్రదింపులు ప్రారంభించారు. ఎక్కడెక్కడ సమస్యలున్నాయో తెలుసుకొని తక్షణమే జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను సహాయకచర్యలకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు.

# ఊరును ముంచిన నీరు

### కన్నీరుపెడుతున్న మోరంచపల్లి

- గ్రామమంతా ముంపులోనే
- వరద ఉధృతికి కొట్టుకుపోయిన నలుగురు
- భవనాలు, చెట్లు ఎక్కి ప్రాణాలు దక్కించుకుంటున్న స్థానికులు
- హెలికాప్టర్ పంపండి.. సీఎం కేసీఆర్ ఆదేశాలు
- ఆఘమేఘాల కింద సహాయక చర్యలు చేపడుతున్న ప్రభుత్వం
- తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు

హైదరాబాద్, జూలై 27 (తెలుగుప్రభ)


భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. చెరువులు, వాగులు పొంగి భయోత్పాతం సృష్టిస్తున్నాయి. స్థానికులు గుండెలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు. ప్రభుత్వం ఎక్కడికక్కడ సహాయక చర్యలు ముమ్మరం చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మోరంచపల్లి అయితే మొత్తం గ్రామమే నిండా మునిగింది. బుధవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జిల్లాలోని మొరంచవాగు ఉగ్రరూపం దాల్చి ఉప్పొంగుతోంది. భూపాలపల్లి-పరకాల ప్రధాన రహదారిపై మొరంచపల్లి వద్ద సుమారు 15 అడుగుల ఎత్తులో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మొరంచపల్లి గ్రామాన్ని వరద ముంచెత్తింది. ఇండ్లలోకి వరద నీరు చేరడంతో బిల్డింగ్‌లు, చెట్లపైకి ఎక్కి ప్రాణాలను రక్షించుకున్నారు. అంతకంతకు వరద ప్రవాహం పెరిగిపోవడంతో భయాందోళనలకు గురవుతున్నారు. తమను కాపాడాలని ఆర్తనాదాలు చేస్తున్నారు. మోరంచపల్లి గ్రామంలో సుమారు 1500 మంది జనాభా ఉన్నట్లు తెలుస్తోంది.

### రెడ్ అలర్ట్

వాయవ్య బంగాళాఖాతంలో ఏపీ, ఒడిశా తీరంలో తీవ్ర అల్పపీడనానికి అనుబంధంగా ఉన్న ఆవర్తనం సముద్ర మట్టం నుంచి 7.6 కి.మీ ఎత్తు వరకు స్థిరంగా కొనసాగుతున్నది. దీని ప్రభావంతో తెలంగాణలో రెండ్రోజులపాటు అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని వెల్లడించింది. ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, యాదాద్రి-భువనగిరి జిల్లాలకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. నిర్మల్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్దిపేట, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

### 33 శాతం అదనంగా వర్షపాతం: డైరెక్టర్

రాష్ట్రవ్యాప్తంగా ఈ సీజన్‌లో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైనట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ నాగరత్న తెలిపారు. జూన్ 1 నుంచి బుధవారం నాటికి 313.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 416.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు చెప్పారు. సాధారణం కంటే దాదాపు 33 మిల్లీమీటర్ల అధిక వర్షపాతం నమోదైందని, మరో వారంపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలతో మరింత అధిక వర్షపాతం రికార్డు అయ్యే అవకాశం ఉన్నదని వెల్లడించారు. నల్లగొండ జిల్లా మినహా రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో అత్యంత అధిక వర్షపాతం, 21 జిల్లాల్లో అధిక వర్షపాతం, ఆరు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైనట్టు వివరించారు.





## పటాన్‌చెరువు ఎమ్మెల్యే ఇంట తీవ్ర విషాదం



### గుండెపోటుతో కొడుకు మృతి

హైదరాబాద్, జూలై(తెలుగుప్రభ):

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన పెద్ద కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి(30)గురువారం తెల్లవారుజామున గుండెపోటుతో మరణించారు. కిడ్నీ సమస్యలతో గత కొన్ని రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు కామెర్లు కూడా సోకాయి. కిడ్నీ చికిత్సలో భాగంగా డయాలసిస్ చేశారు. కొద్దిరోజులుగా వెంటిలేటర్‌పైనే ఉన్నారు. ఈ నేపథ్యంలో తెల్లవారుజామున గుండెపోటు రావడంతో మృతి చెందారు. మృతదేహాన్ని నివాసానికి తీసుకువచ్చారు.

## టీ శాట్ ద్వారా అద్భుతమైన సేవలు

### స్టార్టప్‌లు ఇంకా పెరగాలి.. కేటీఆర్

హైదరాబాద్, జూలై 27 (తెలుగుప్రభ)

టీ శాట్ ద్వారా విద్యార్థులకు, యువకులకు అద్భుతమైన సేవలు అందుతున్నాయని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె. తారక రామారావు అన్నారు. విశేషంగా అనుభవం ఉన్న శైలేష్ రెడ్డిని ఈ సంస్థకు సీఈఓ గా నియమించినట్లు తెలిపారు. టీ శాట ఆరవ వార్షికోత్సవంలో ఆయన పాల్గొని ఉద్యోగులందరికీ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రణాళికాయుతంగా టీశాట్ అనేక కార్యక్రమాలు రూపొందిస్తోందన్నారు. ప్రభుత్వ కృషితో దాదాపు 90 లక్షల మంది ప్రస్తుతం ఈ సంస్థ సేవలను అందుకుంటున్నట్లు వెల్లడించారు. పదివేల గంటలకు పైగా కంటెంట్ తో ప్రత్యేకంగా యాప్‌ని తయారు చేశారని, దీన్ని లక్షలాది మంది డౌన్‌లోడ్ చేసుకున్నారని తెలిపారు. అయితే, మారుతున్న ధోరణులకు అనుగుణంగా సంస్థ కంటెంట్ లో కూడా అవసరమైన మార్పులు తీసుకురావాలని సూచించారు. యానిమేషన్ మల్టీమీడియా వంటి అంశాలను జోడిస్తూ కంటెంట్ ను మరింత ఆకర్షణీయంగా, ఆసక్తిగా రూపొందించే ప్రయత్నం చేయాలన్నారు. విద్యార్థులు ఎప్పుడు కావాలంటే అప్పుడు తమ ఉద్యోగ పరీక్షలు మాదిరి నమూనా పరీక్షలు లేదా మాక్ టెస్టులు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఉస్మానియా యూనివర్సిటీతో ఈరోజు టీ శాట్ అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకోవడం సంతోషకరమన్నారు. ఉస్మానియా నుంచి కూడా స్టార్టప్ లు పెరగాలని ఆకాంక్షించారు. తమ పురపాలక శాఖ ద్వారా నిజాం కాలేజీ హాస్టళ్ల నిర్మాణానికి దాదాపు 32 కోట్లకు పైగా నిధులను కేటాయించినట్లు వివరించారు.



## రేపు కూడా సెలవే

హైదరాబాద్, జూలై 27 (తెలుగుప్రభ)

భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం రేపు ( శుక్రవారం) కూడా సెలవు ప్రకటించింది. అందుకు సంబంధించి తక్షణమే ఉత్వర్వులు జారీ చేయాలని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు ఆదేశించారు. ఈ మేరకు మంత్రి తమ శాఖ ద్వారా అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

## భారీ అగ్నిప్రమాదం.. 3 వేల కార్లు దగ్ధం

న్యూఢిల్లీ, జూలై 27 (తెలుగుప్రభ)

నెదర్లాండ్స్‌లోని ఉత్తర సముద్రంలో సరుకు రవాణా చేసే ఒక నౌకలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ మంటల్లో నౌకలో ఉన్న 3 వేల కార్లు దగ్ధమైనట్టు తెలుస్తోంది. నౌక సిబ్బందిలో ఒకరు మంటల్లో చిక్కుకొని మరణించగా మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఇంకొందరు ప్రాణరక్షణ కోసం సముద్రంలో దూకారు. ఆ నౌకలో దట్టంగా పొగ అలుముకోవడంతో శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు తలెత్తాయి. 22 మంది నౌకా సిబ్బందిని ఆస్పత్రికి తరలించారు. నౌకలో ఉన్న 25 ఎలక్ట్రిక్ కారుల్లో ఒక దానిలో మంటలు చెలరేగడం వల్లే అగ్ని ప్రమాదం జరిగినట్టుగా తెలుస్తోంది.

## పరిస్థితులెలా ఉన్నా మేం సిద్ధం

### గతంలోలా ఏమీ లేవు : మంత్రి తలసాని

హైదరాబాద్, జూలై 27 (తెలుగుప్రభ)

హైదరాబాద్ మహా నగరంలో ఎలాంటి వర్ష పరిస్థితులెదురైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ కంట్రోల్‌రూమ్‌ను సందర్శించిన ఆయన అనంతరం మేయర్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల కనుగుణంగా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనర్, సిబ్బంది పూర్తిస్థాయిలో పనిచేస్తున్నారన్నారు. అవసరమైతే తరలించేందుకు వీలుగా సర్కిల్‌కో పున రావాస సహాయ కేంద్రాన్ని సిద్ధంగా ఉంచామన్నారు. గతంలో మాదిరిగా భయంకర పరిస్థితులేమీ లేవని చెప్పారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు జంట జలాశయాల పరిస్థితులు ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. జీహెచ్‌ఎంసీ కంట్రోల్‌రూమ్ తోపాటు సిబ్బఅంది 24 గంటలు పనిచేస్తున్నారన్నారు. సమావేశంలో కమిషనర్ రోనాల్డ్‌స్, తదితరులు పాల్గొన్నారు.

